క్లుప్తంగా

ఆధార్ క్యాంపులు వినియోగించుకోవాలి



ఫిరంగిపురం: మండలంలో తక్కెళ్లపాడు, పొనుగుపాడు గ్రామాల్లో మంగళవారం ఆధార్ క్యాంప్‌లు నిర్వహించారు. ఎంపీడీవో వెంకటేశ్వరరావు వీటిని పరిశీలించి శిబిరాలను వినియోగించుకోవాలని చెప్పారు. ఈ నెల 20, 21వ తేదీల్లో వేములూరిపాడు, బేతపూడి గ్రామాలు, 24, 25వ తేదీల్లో మేరికపూడి, అల్లంవారిపాలెంలోని అంగన్‌వాడీ సెంటర్లలో ఆధార్ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 27న అల్లంవారిపాలెం, నుదురుపాడు గ్రామాల్లో నిర్వహిస్తామని చెప్పారు.

తరలి రావాలి

మంగళగిరి: ధరలు లేక నష్టపోతున్న మిర్చి రైతులకు భరోసా కల్పించేందుకు మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన కార్యక్రమాన్ని నియోజకవర్గం నుంచి రైతులు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, ఆప్కో మాజీ చైర్మన్ చిల్లపల్లి మోహనరావు మంగళవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం 10 గంటలకు జగన్ మోహన్‌రెడ్డి గుంటూరు మిర్చి యార్డుకు చేరుకుని రైతులతో ముఖాముఖీ మాట్లాడి, వారి సమస్యలు తెలుసుకుంటారని తెలిపారు.

పంటల పరిశీలన



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు అవగాహన టెక్నిక్స్ కార్యక్రమాన్ని మంగళవారం ఇప్పటం గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు పలువురు రైతుల వద్ద వెళ్లి ఏ విధంగా సేద్యం చేస్తున్నారు? ఏమేమి పంటలు వేస్తున్నారో వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామానికి సంబంధించిన వ్యవసాయ భూమి, పంటలు, నీటి వసతి, గ్రామ స్వరూప చిత్రపటాన్ని అందంగా తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వ్యవసాయ కళాశాల డైరెక్టర్ డాక్టర్ రత్న ప్రసాద్, హెచ్‌ఓడీ డాక్టర్ బాలకృష్ణ, డాక్టర్ రాజేశ్వర్, డాక్టర్ అవినాష్, డాక్టర్ ఉదయ్ భాస్కర్, విద్యార్థులు ఖాజాబీ, విష్ణుప్రియ, కావ్య పాల్గొన్నారు.

పాములపాడు చెరువు అభివృద్ధికి శ్రీకారం



పాములపాడు(తాడికొండ): మండలంలోని పాములపాడు గ్రామంలో పంచాయతీ చెరువు అభివృద్ధికి పాలకులు శ్రీకారం చుట్టారు. చెరువు చుట్టూ కట్టలు ధ్వంసమై, పిచ్చికంప, ముళ్ల పొదలు పెరిగిపోవడతో..మంగళవారం తొలగింపు పనులు చేపట్టారు. సర్పంచ్ బిక్కి శివరామకృష్ణ, పాలకవర్గ సభ్యులు శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించారు. పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రెండో రోజు తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి

తెనాలిరూరల్: అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) కోర్టులో ఓ కేసు(590/24)కు సంబంధించిన తీర్పును న్యాయమూర్తి మంగళవారం రెండో రోజు తెలుగులో చెప్పారు. ప్రో నోటుకు సంబంధించిన కేసులో న్యాయమూర్తి తీర్పును తెలుగులో వెలువరించారు. మాతృభాష ఔన్నత్యాన్ని తెలియజేసేందుకు న్యాయమూర్తులు కృషి చేస్తున్నారని కోర్టు వర్గాలు తెలిపాయి.

8 ఏళ్ల లోపు మెదడు అభివృద్ధి

కొల్లిపర: మూడు సంవత్సరాల నుండి ఎనిమిది సంవత్సరాల లోపు పిల్లలకు 85శాతం వరకు వారి బ్రెయిన్ వేగవంతంగా డెవలప్ మెంట్ జరుగుతుందని, అటువంటి సమయంలో వారిని జాగ్రత్తగా అన్ని విషయాలతోపాటు చదువు పై ప్రత్యేక శద్ధ ఉండేలా అంగన్‌వాడీ కేంద్రాలల్లో అంగన్‌వాడీ టీచర్లు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంఈవో సాల్మాన్‌రాజు అన్నారు. మంగళవారం స్థానిక హైస్కూల్ లో అంగన్‌వాడీ టీచర్లలకు 120 రోజుల జ్ఞానజ్యోతి కోర్స్ ట్రెనింగ్ క్లాస్‌లను ఆయన ప్రారంభించారు. 120 రోజుల ట్రెనింగ్ క్లాస్‌లలో అంగన్‌వాడీ టీచర్లు తప్పని సరిగా పాల్గొని నిపుణులు అందిస్తున్న అంశాలను పాటించాలన్నారు. హెచ్ఎం వెంకట్రావ్, ఆర్‌పీలు పి.మృత్యుంజయిరావ్, రాధిక , శ్రీలత , సిఆర్‌పి పి.రమేష్‌బాబు పాల్గొన్నారు.


ఖాకీల అలసత్వం

- కేసుల దర్యాప్తులో విఫలం
- చోరీల ఛేదనలోనూ చేతులెత్తేస్తున్న వైనం
- విచ్చలవిడిగా దొంగతనాలు
- రౌడీషీటర్ల కదలికలపై పూర్తి నిర్లక్ష్యం
- మంగళగిరి, తాడేపల్లిలో పెరిగిపోతున్న నేరాలు
- అదుపు చేసేందుకు వేధిస్తున్న సిబ్బంది కొరత

మంగళగిరి టౌన్: మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లు రాజధాని ప్రాంతానికి ముఖద్వారంగా ఉన్నాయి. ఈ పోలీస్ స్టేషన్ల పరిధిలో గతంలో క్రైమ్ రేట్ ఎక్కువగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ శాతం తగ్గింది. ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో అరకొర కేసులను పోలీసులు పరిష్కరించలేకపోతున్నారు. దీనికి ముఖ్యకారణం సిబ్బంది కొరత అని అధికారులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఉన్న సిబ్బంది బదిలీలపై వెళ్లడంతో వారి స్థానంలో కొత్తవారు రాకపోవడం, వచ్చిన సిబ్బందికి ఇక్కడి ప్రాంతంపై పూర్తిగా అవగాహన లేకపోవడంతో విచ్చలవిడిగా నేరాలు జరుగుతున్నాయి. సమాచారం వచ్చినా పోలీసు సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లేందుకు రెండు మూడు గంటల సమయం పట్టడంతో జరగాల్సిన నష్టం జరిగిపోతోంది.

గస్తీ ఎక్కడ?

రాత్రిళ్లు గస్తీ నిర్వహించే పోలీసులు 5 నుంచి ఆరుగురే ఉన్నారు. ఈ మధ్యకాలంలో పాత నేరస్తుడు ఒకే నెలలో తాళం వేసిన ఆరు ఇళ్లల్లో చోరీలకి పాల్పడ్డాడు. ప్రతి ఘటనా స్థలంలో పోలీసులు వివరాలు సేకరించారు కానీ, దర్యాప్తులో అలసత్వం వల్ల ఆ దొంగను మొదట్లోనే కట్టడి చేయడంలో నిర్లక్ష్యం వహించారనడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. మంగళగిరి, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో నిత్యం చైన్ స్నాచింగ్‌లు జరుగుతున్నాయి. సీసీ కెమెరా ఫుటేజ్‌లను పరిశీలించే తీరిక లేక అవి పెండింగ్‌లో పడుతున్నాయి. గుర్తుతెలియని మృతదేహాలు నెలకు కనీసం 5, 6 వరకు వస్తుంటాయి. కనీసం ఆ మృతదేహాల వివరాలు సేకరించలేకపోతున్నారు.



నులకపేటలో చోరీ జరిగిన ఇంటిలోని బీరువా

వరుస దొంగతనాలు

రెండు నెలల కాలంలో పోలీసులు ఎట్టకేలకు భారీ చోరీలను ఛేదించారు. నిందితులను జైలు పంపించి, హమ్మయ్య అనుకునే లోపే తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేట, ప్రకాష్ నగర్, మహానాడు ప్రాంతాల్లో ఒకే రోజు దొంగతనాలు జరిగాయి. మంగళగిరి పట్టణ పరిధిలో భావనా ఋషి కల్యాణ మహోత్సవం సందర్భంగా పోలీసులు అక్కడ బందోబస్తు ఉండగానే.. 5 కేజీల బంగారాన్ని ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తుంటే.. ఇద్దరు వాహనంపై వచ్చి బెదిరించి దారి దోపిడీకి పాల్పడ్డారు. అది నిజమా కాదా అని తేల్చేందుకు పోలీసులు మదన పడుతున్నారు. ఈ కేసును చేదించేందుకు నాలుగు పోలీస్ స్టేషన్‌లలో పనిచేసే క్రైమ్ సిబ్బందిని పిలిపించి విచారణ చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. చిన్నపాటి నేరాలను కూడా పరిశీలించేందుకు సమయం తీసుకుంటుండడంతో ప్రజలు పోలీసుల తీరుపై బాధితులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కేసుల తేలేదెన్నడూ..

మంగళగిరి రూరల్ పరిధిలోని తెనాలి, మంగళగిరి రోడ్డులో ఆత్మకూరు వద్ద రోడ్డు వెంబడి ఉన్న డ్రెయినేజీలో పూడిక తీస్తున్న సమయంలో గుర్తుతెలియని మృతదేహం బయట పడింది. అది హత్యా? ప్రమాదమా? ఆత్మహత్యా అని పోలీసులు నేటికీ తేల్చలేదు. తాడేపల్లి, మంగళగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఇలా గుర్తుతెలియని మృతదేహాలు వచ్చినప్పుడు పోస్ట్‌మార్టం రిపోర్టులు ఆలస్యం అవడంతో ఏం జరిగిందో అర్థం కావడం లేదు. ఈ మూడు పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసుల కొరత వల్లే దర్యాప్తు ముందుకు సాగడం లేదని అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ ప్రాంతాల్లో ఉన్న రౌడీషీటర్లపై క్రైం బ్రాంచి సిబ్బంది సరైన దృష్టి సారించకపోవడంతో రౌడీ షీటర్లు భూ దందాలు, సెటిల్‌మెంట్లు చేస్తున్నారు.

అలసత్వం వల్ల గుర్తుతెలియని మృతికింద పోలీసులు ఒక వ్యక్తి మృత దేహాన్ని ఖననం చేశారు. ఆ వ్యక్తి పల్నాడు జిల్లా రాజుపాలెం మండలానికి చెందిన భార్య, ప్రియుడి చేతిలో హత్యకు గురయ్యాడు. హత్య అనంతరం మృతదేహాన్ని పెట్రోల్ పోసి తగలబెట్టి బకింగ్‌హామ్ కెనాల్‌లో కుంచనపల్లి వద్ద పడవేశారు. తాడేపల్లి పోలీసులు ఆ మృతదేహాన్ని వెలికితీసి ఖననం చేశారు. కానీ, ఎక్కడ ఖననం చేశారో మర్చిపోయారు. మృతదేహం కూడా దొరకలేదు. ఈ కేసులో హత్యచేసిన వారు తప్పించుకునే అవకాశం ఏర్పడిందని, మృతదేహం లభించకపోవడంతో సాక్ష్యాలు లేక కేసు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని అధికారులే చెబుతున్నారు.

అటాచ్‌ల పేరుతో..

స్టేషన్‌లలో సిబ్బంది కొరత వేధిస్తుండగా, పలువురు సిబ్బంది నచ్చిన చోటుకు అటాచ్‌లపై వెళ్లడం గమనార్హం. అధికారులు మారినప్పుడు వారికి నచ్చిన వారిని తెచ్చి పెట్టుకుంటుంటారు. కొత్తగా వచ్చిన అధికారి తనకు నచ్చిన ఇద్దరు ముగ్గురిని అటాచ్ చేయించుకుంటున్నారు. ఇక ట్రాఫిక్‌లో పని చేసే వారికి అదనపు అలవెన్స్‌లు ఇస్తారు. అందుకే ఎక్కువ మంది అటాచ్‌లపై నచ్చిన చోటుకు వెళ్తున్నారన్న విమర్శలున్నాయి. దాంతో వారు అలా అదనపు అలవెన్సులు పొందుతున్నారు. మంగళగిరి పట్టణ, రూరల్, తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి స్టేషన్ నుంచి ముగ్గురు నలుగురు సిబ్బంది అటాచ్‌పై వెళ్లారు.

రీసర్వే పరిశీలించిన జేసీ



తాడికొండ: తుళ్లురు మండలంలో భూముల రీసర్వేను మంగళవారం జిల్లా సంయుక్త కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ పరిశీలించారు. రీ సర్వే బ్లాక్ సరిహద్దును పరిశీలించి గ్రౌండ్ ట్రూతింగ్ కార్యక్రమానికి హాజరైన రైతులతో మాట్లాడారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామ పటం, ఓఆర్ఐ షీట్లను పరిశీలించి గ్రామ సర్వేయర్లు, వీఆర్‌వోలకు తగిన సూచనలు జారీ చేశారు. రీ-సర్వే ప్రక్రియ త్వరితగిన పూర్తయ్యేలా ప్రణాళికాబద్ధంగా చేయాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ సుజాత, సర్వే సహాయ సంచాలకులు, డిప్యూటీ ఇన్స్‌పెక్టర్ ఆఫ్ సర్వేయర్, మండల సర్వేయర్, గ్రామ సర్వేయర్లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

రాయలసీమ వర్సిటీ వీసీగా మంగళగిరి వాసి

మంగళగిరి టౌన్ : మంగళగిరి పట్టణానికి చెందిన ఉడతా వెంకట బసవరావు కర్నూలు రాయలసీమ యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా నియమిస్తూ గవర్నర్ యస్ అబ్దుల్ నజీర్ మంగళవారం ఆదేశాలు జారీ చేయడంతో చేనేత పద్మశాలీ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేసింది. మంగళవారం పలువురు పద్మశాలీయ సంఘం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రాయలసీమ యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా మూడేళ్లు పదవీ కాలంలో కొనసాగనున్నారని పేర్కొన్నారు.

లక్ష్మణరావు గెలుపునకు ప్రచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు పట్టభద్రులు ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కేఎస్ లక్ష్మణరావును గెలిపించుకోవాలని సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం ఎంటీఎంసీ పరిధిలోని వడ్డేశ్వరంలో ప్రజా సంఘాల నాయకులతో కలిసి లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లు, అంగన్‌వాడీ, అవుట్ సోర్సింగ్ మున్సిపల్ కార్మికుల సమస్యలపైనే కాకుండా రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై శాసన మండలిలో ప్రజా గొంతుకై లక్ష్మణరావు పోరాడారని తెలిపారు. కౌలు రైతు సంఘం తాడేపల్లి మండల కార్యదర్శి పల్లె కృష్ణ, కేవీపీఎస్ నాయకులు నాగపోగు విజయరాజు, సీఐటీయూ నాయకులు ఎస్కే గన్, ఆరుమళ్ళ నాగిరెడ్డి పాల్గొన్నారు.

■ ఉండవల్లిలో ప్రజా సంఘాల నాయకులు ఈమని రామారావు, వల్లభాపురం వెంకటేశ్వరావు ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మంగళవారం ప్రచారం నిర్వహించారు. లక్ష్మణరావు గెలుపు ప్రజలు, ఉద్యోగుల గెలుపుగా భావించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పలుకూరి గాంధీ, కాపవరపు రామకృష్ణ పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న దొంతిరెడ్డి వెంకటరెడ్డి

లక్ష్మణరావు తరపున ఎన్నికల ప్రచారం

దుగ్గిరాల: మండలంలోని పెనుమూలి గ్రామంలో పీడీఎఫ్ పట్టభద్రుల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావును మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఇంటింటా తిరిగి జెట్టి బాలరాజు ప్రచారం చేశారు. రైతు సంఘం మండల కార్యదర్శి వై.బ్రహ్మేశ్వరరావు కౌలు రైతు సంఘం మండల అధ్యక్షుడు బి.అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

సీపీఎం నేత చుక్కాకుల పోతురాజు మృతి



దుగ్గిరాల: సీపీఎం సీనియర్ నాయకుడు చుక్కాకుల పోతురాజు(78) వృద్ధాప్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమారుడు సీపీఎం సభ్యునిగా పనిచేస్తున్నారు. దుగ్గిరాలలోని స్వగృహంలో మృతదేహానికి మంగళవారం సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నేతాజీ సందర్శించిన ఎర్ర జెండా కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ స్వీపర్ పని నుంచి అటెండర్, బిల్ కలెక్టర్‌గా ఉద్యోగులు బాధ్యతలు నిర్వహించి పదవీ విరమణ చేశారని చెప్పారు. ఆయన మరణం సీపీఎంకు తీరని లోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. అంతిమయాత్ర బుధవారం జరుగుతుందని జిల్లా కార్మిక నాయకులు జెట్టి బాలరాజు పేర్కొన్నారు.

రైలు కింద పడి గుర్తుతెలియని వ్యక్తి మృతి



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి కృష్ణాకెనాల్ జంక్షన్ పరిధిలోని కృష్ణా కెనాల్ బ్రిడ్జి వద్ద రైల్వే ట్రాక్‌పై గుర్తుతెలియని మృతదేహం ఉన్నట్లు గుంటూరు రైల్వే పోలీసులు మంగళవారం గుర్తించారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు సుమారు 25 నుంచి 35 సంవత్సరాలు ఉండవచ్చని, మృతుడి వంటిపై పింక్ కలర్ షాట్, పాచి కలర్ టీ షర్ట్‌పై పసుపు రంగు కలిగి ఉందని తెలిపారు. మృతుడి ఒంటిపై ఎటువంటి గుర్తులు లేవని, ఈ వ్యక్తి రైలులోనుండి జారి పడి మృతి చెంది ఉండాలని భావిస్తున్నాని, ఎవరైనా గుర్తిస్తే 90109 99939, 94407 90522 నంబర్లకు సమాచారం ఇవ్వాలని రైల్వే పోలీసులు తెలిపారు.

'ఆళ్ల'కు కవితా పురస్కారం



తెనాలి: ఎలైట్ రైటర్స్ అసోసియేషన్ నిర్వహించిన కవితల పోటీలో పట్టణానికి చెందిన కవి, రచయిత, ఆర్టీసీ కండక్టర్ ఆళ్ల నాగేశ్వరరావు కవిత 'మాతృభాష మాధుర్యం'కు ఉత్తమ కవితా పురస్కారం లభించింది. ప్రతిబావంతులైన రచయితలు, కవులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఎలైట్ రైటర్స్ సంస్థ 300 పైగా కవులు, రచయితలతో సాహిత్య పోటీలను కొనసాగిస్తోంది. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ చిటికెన కిరణ్ కుమార్, నిర్వాహకులు కె.పద్మావతి, కె.విద్యుల్లత, టి.సాధనకు ఆళ్ల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.

ఓటు హక్కు వినియోగం అందరి బాధ్యత

మంగళగిరి టౌన్ : ఓటు హక్కును వినియోగించుకోవడం అందరి బాధ్యత అని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ. భార్గవ తేజ అన్నారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు కృష్ణా గుంటూరు జిల్లా పట్టభద్రుల ఎన్నికలు జరుగనున్న సందర్భంగా మంగళగిరి ఓటర్లకు అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మంగళగిరి పట్టణ లక్ష్మి నరసింహస్వామి గాలిగోపురం నుంచి మిద్దె సెంటర్ వరకు ఓటర్ల అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుని ఆదర్శవంతమైన ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేసుకునే అవకాశం ఓటర్లకు ఉందని అన్నారు. ఈ నెల 27న జరుగనున్న కృష్ణా గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తప్పని సరిగా ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఓటు హక్కు వినియోగానికి సంబంధించి ప్రతిజ్ఞ చేయించారు. ఓటు హక్కును ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా వినియోగించుకోవాలని సూచించారు. ఈ అవగాహన కార్యక్రమంలో ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి సంజీవరావు, ఉపాధి కల్పనాధికారి దుర్గాభాయి, నియోజక వర్గ ఓటర్ల నమోదు అధికారి లక్ష్మీకుమారి, డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్, తహశీల్దార్ దినేష్ రాఘవేంద్ర, ఎంపీడీవో సుగుణమ్మ, దుగ్గిరాల ఎమ్మార్వో సునీత, నగరపాలక సంస్థ, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న జాయింట్ కలెక్టర్ భార్గవతేజ

ఈసీసీఈ బలోపేతానికి శిక్షణ దోహదం

ఫిరంగిపురం: ఈసీసీఈ(ఎర్లీ చైల్డ్ హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్) బలోపేతానికి శిక్షణ ఎంతో దోహదపడుతుందని ఎంఈవోలు షేక్.మహబూబ్ సుబాని, రవికాంత్ అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో నుదురుపాడు, అల్లంవారిపాలెం జెడ్పీ పాఠశాలల్లో ఈసీసీఈపై అంగన్‌వాడీలకు ఆరు రోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఎంఈవోలు పరిశీలించారు. డీఆర్పీ చంద్రశేఖరరెడ్డి బాల్య సంరక్షణ, విద్యపై పలు అంశాలను వివరించారు. విద్యార్థులు చదువుకునే విధానం, ఎలా బోధించాలి తదితర అంశాలను తెలియజేశారు. భారత్ మిషన్ ముఖ్య ఉద్దేశాలు, లక్ష్యాలను వివరించారు. సీడీపీవో పి.ప్రసూన, డి.సునీత, మహాలక్ష్మీ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈవోలు షేక్.మహబూబ్ సుబాని, రవికాంత్

అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతి శిక్షణ

మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీ ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం మండల విద్యాశాఖ, ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞానజ్యోతిపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంఈఓ బాబు, ఐసీడీఎస్ మంగళగిరి ప్రాజెక్ట్ సీడీపీఓ సులోచన మాట్లాడుతూ అంగన్‌వాడీ పిల్లల అభ్యాసం, ఆరోగ్యాన్ని మెరుగు పరచడానికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. 0-6 సంవత్సరాల మధ్య వయస్సు గల వివిధ దశల శారీరక, భావోద్వేగ, మేధో వికాసాల గురించి కార్యకర్తలకు అవగాహన కల్పించడమే ఈ శిక్షణ లక్ష్యమని పేర్కొన్నారు. అంగన్‌వాడీల్లో పిల్లల హాజరును మెరుగు పరచడం కూడా ఈ శిక్షణలో ఒక భాగమని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ప్రీ ప్రైమరీ స్కూల్‌లో బోధించడానిక జ్ఞానజ్యోతి 120 రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ సిబ్బంది మోహనరావు, వెంకటేష్ నాయక్, ఐసిడిఎస్ సిబ్బంది రత్నకుమారి తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న అంగన్‌వాడీ కార్యకర్తలు

23న శ్రీశైల మల్లన్న తలపాగ గ్రామోత్సవం

మంగళగిరి టౌన్: ఈ నెల 23న ఆదివారం అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళగిరిలో శ్రీశైల మల్లన్న తలపాగ గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు సంఘ ప్రతినిధులు మంగళవారం తెలిపారు. మంగళగిరి పరిధిలోని శివాలయంలో గ్రామోత్సవ ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘ ప్రతినిధులు మాట్లాడుతూ దేవాంగులు ఎంతో నియమ నిష్టలతో ఉపవాస దీక్షలతో నేత నేసిన మల్లన్న తలపాగ దిగంబర దోషాలను నివారిస్తుందని, మహాశివరాత్రి రోజున అర్ధరాత్రి లింగోద్భవ సమయంలో శ్రీశైల శిఖర నవ నందులకు తలపాగాను అలంకరించనున్నట్లు పేర్కొన్నారు. మంగళగిరి శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తుల సందర్శనార్థం తలపాగ ఉంచబడుతుందన్నారు. అనంతరం నగర పుర వీధుల్లో శివనామ స్మరణతో భక్తులు తలపై పెట్టుకుని గ్రామోత్సవం నిర్వహిస్తారని తెలిపారు. ఈ గ్రామోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ జేవీ నారాయణ, ప్రధాన అర్చకులు మహేష్‌కుమార్ శర్మ, అమరావతి దేవాంగ సంక్షేమ సంఘం అధ్యక్షులు బల్లా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి తాతారావు, కోశాధికారి అల్లక నమశ్శివాయ, బొమ్మన శ్యామ్‌కుమార్, వెంకటేశ్వరరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న దేవాంగ సంక్షేమ సంఘం ప్రతినిధులు

పుష్కర ఘాట్లలో విస్తృత తనిఖీలు

మందుబాబులకు, ప్రేమ జంటలకు కౌన్సెలింగ్

తాడేపల్లిరూరల్ : సీతానగరం కృష్ణా తీరంలో మంగళవారం రాత్రి తాడేపల్లి పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మందుబాబులకు, ప్రేమ జంటలకు ఎస్ఐ జె. శ్రీనివాసరావు తమదైన శైలిలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే సహించేది లేదని, వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని తెలిపారు. ఇసుక తిన్నెల్లో ప్రేమ జంటలు కనబడడంతో వారికి తమదైన శైలిలో కౌన్సెలింగ్ నిర్వహించి, వారిని అక్కడి నుండి పంపించి వేశారు. పుష్కర ఘాట్‌లలో లైటింగ్ లేని ప్రదేశాల్లోకి, ఇసుక తిన్నెల్లోకి ఎవరూ వెళ్లవద్దని హెచ్చరికలు జారీ చేశారు. రాత్రిళ్లు ఎవరైనా కృష్ణానది నీటిలోకి వెళితే తమకు సమాచారం ఇవ్వాలని, ఘాట్‌లపై ఉన్న చిరు వ్యాపారులకు పోలీసులు సూచనలు చేశారు.



పుష్కర ఘాట్‌లో తనిఖీలు నిర్వహిస్తున్న తాడేపల్లి పోలీసులు

మహా బృందనాట్యంలో తెనాలి చిన్నారులు

తెనాలి: శ్రీత్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పర్యవేక్షణలో హైదరాబాద్ ముచ్చింతల్ లోని సమతా మూర్తి స్ఫూర్తి కేంద్రంలో జరుగుతున్న సమతా కుంభ్-2025, మహా బృందనాట్యంలో తెనాలి చిన్నారులు పాల్గొన్నారు. ఈనెల 9వ తేదీ నుండి 19వ తేదీ వరకు సమతా కుంభ్-2025 శ్రీరామానుజాచార్య-108 దివ్యదేశాల బ్రహ్మోత్సవాలు జరుగుతున్నాయి. ప్రముఖ నృత్యగురువు ఘంటసాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో మూడు వేలమంది కూచిపూడి నృత్యకళాకారులతో జరిగిన మహాబృందం నాట్యంలో తెనాలికి చెందిన నృత్యగురువు చల్లా యామిని నలుగురు శిష్యులు బాగస్వాములయ్యారు. ప్రదర్శన అనంతరం శ్రీచినజీయరుస్వామి చేతులమీదుగా నృత్య గురువు చల్లా యామినికి జ్ఞాపికను బహూకరించారు. మహా బృందనాట్యానికి వచ్చిన నాలుగు రికార్డ్స్‌కు సంబంధించిన ధృవీకరణ పత్రాలను, పతకాలను చిన్నారులకు బహూకరించారు. సనాతన ధర్మాన్ని పాటిస్తూ మనసంప్రదాయ కళలను చిన్నారులకు నేర్పిస్తున్న తల్లిదండ్రులను స్వామి అభినందించారు.



చిన్న జీయరు స్వామి నుంచి జ్ఞాపికను స్వీకరిస్తున్న చల్లా యామిని

అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలి

తెనాలిరూరల్: మార్చి 8వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా చూడాలని రెండో అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ పి.రాజశేఖర్ పోలీసులకు సూచించారు. పోలీసుల అధికారులతో తన చాంబర్‌లో మంగళవారం ఆయన సమావేశమయ్యారు. రాజీ అయ్యే వీలున్న కేసులన్నిటినీ అదాలత్‌లో పరిష్కరించుకునేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. అదాలత్‌లో కేసులు పరిష్కరించుకోవడం ద్వారా సమయంతో పాటు డబ్బులు ఆదా అవుతాయని స్పష్టం చేశారు. అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా చొరవ చూపాలని కోరారు. వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్, బాపట్ల జ్జి వేమూరు, కొల్లూరు. చుందూరు, అమృతలూరు ఎస్‌ఐలు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజశేఖర్

ప్రాథమిక పాఠశాల అభివృద్ధికి రోటరీ సాయం

తెనాలి: ఇటీవలి వరదలకు లంక గ్రామాల్లో దెబ్బతిన్న పాఠశాలల అభివృద్ధికి రోటరీ క్లబ్ ఆఫ్ తెనాలి వైకుంఠపురం పూనుకుంది. రోటరీ డిస్ట్రిక్ట్ (3150) తరపున ఆపద్బంధు కార్యక్రమంలో రావిపూడి పెదలంకలోని ప్రాథమిక పాఠశాలను అభివృద్ధి చేశారు. మంగళవారం రోటరీ 3150 గవర్నర్ కాట్రగడ్డ శరత్‌చౌదరి చేతులమీదుగా ప్రారంభోత్సవం చేశారు. పీడీజీ అన్నే రత్నప్రభాకర్, ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ పి.విష్ణుబాబు, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఈదర శ్రీనివాసరావు, దేవయజనం మురళీకృష్ణ, ఓబులారెడ్డి, గుత్తా వెంకటరత్నం, ఈదర వెంకట పూర్ణ చంద్, కన్నెగంటి మురళీకృష్ణ, పావులూరి రాంబాబు, క్లబ్ సభ్యులు కొల్లి రాజేంద్ర పసాద్,ఆలపాటి వెంకట్రామయ్య, రాజశేఖర్ రెడ్డి మంగళగిరి క్లబ్ అధ్యక్షులు కార్యదర్శి గాజుల శ్రీనివాస్, మురళి తదితరులు పాల్గొన్నారు.

